బుక్ ఫెయిర్ చివరి రోజు అధిక సంఖ్యలో తరలివచ్చిన పుస్తక ప్రియులు

పుస్తకం కొత్త ప్రపంచంలోకి తీసుకెళ్తుంది

- జస్టిస్ రాధారాణి
- ముగిసిన బుక్ ఫెయిర్
- చివరి రోజు భారీగా తరలివచ్చిన పుస్తక ప్రియులు

'కోర్టు తీర్పుల్లో సాహిత్య మెరుపులు', 'తెలంగాణ శిథిలాలు వ్యథభరిత కథనాలు', 'తెలంగాణ చరిత్ర తొవ్వల్లో' సాహిత్య పుస్తకాలను ఆవిష్కరిస్తున్న అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి, మాజీ న్యాయమూర్తి ప్రముఖ రచయిత డాక్టర్ మంగరి రాజేందర్, సీనియర్ జర్నలిస్ట్ రామచంద్రమూర్తి

చిక్కడపల్లి, డిసెంబర్ 29 : ఇందిరాపార్క్ సమీపంలో కళాభారతి ఎన్‌టీఆర్ స్టేడియంలో కొనసాగుతున్న బుక్‌ఫెయిర్ ఆదివారంతో ముగిసింది. 10 రోజులుగా కొనసాగుతున్న పుస్తక ప్రదర్శనలో చివరిరోజు పాఠకులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. ముగింపు సభకు జస్టిస్ రాధారాణి, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం, ప్రముఖ సీనియర్ జర్నలిస్ట్ రామచంద్రమూర్తి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జస్టిస్ రాధారాణి మాట్లాడుతూ పుస్తకం మనల్ని కొత్త ప్రపంచంలోకి తీసుకెళ్తుందన్నారు. ప్రపంచంలో అనేక మార్పులు పుస్తకాలు తెస్తాయన్నారు. మనం చదవడంతో పాటు పిల్లల్ని చదివించాలని సూచించారు. ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ కంప్యూటర్ వచ్చిన పుస్తకాల విలువ తగ్గలేదన్నారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు సైతం పుస్తకాలు చదువుతూ ఉండటం సంతోషకరం అన్నారు. బుక్‌ఫెయిర్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కవి యాకూబ్, ఆర్.వాసులు మాట్లాడుతూ బుక్ ఫెయిర్‌కు 37 యేండ్ల చరిత్ర ఉందని అన్నారు. బుక్ ఫెయిర్‌కు జనాల ఆదరణ పెరిగిందన్నారు. సమాజానికి కావలిసిన జ్ఞానాన్ని అందించే పండుగ పుస్తక పండుగ అని అన్నారు. ఈ రోజుతో బుక్ ఫెయిర్ విజయవంతంగా ముగిసిందన్నారు. ఈ సమావేశంలో బుక్ ఫెయిర్ ఉపాధ్యక్షుడు బాల్‌రెడ్డి, కోశాధికారి నవ చేతన నారాయణ రెడ్డి, శోభన్ బాబు, సురేశ్, సూరిబాబు, సాంబశివరావు, శ్రీకాంత్, శ్రీనివాస్, స్వరాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మూడు పుస్తకాలు ఆవిష్కరణ...

దక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్ ఆధ్వర్యంలో మూడు సాహిత్య చారిత్రక పుస్తకాలను ఆవిష్కరించారు. ప్రముఖ రచయిత డాక్టర్ మంగరి రాజేందర్ (జింబో) రచించిన 'కోర్టు తీర్పుల్లో సాహిత్య మెరుపులు' రచయిత ఎమని శివనాగిరెడ్డి రచించిన 'తెలంగాణ శిథిలాలు వ్యథభరిత కథనాలు' రామోజు హరగోపాల్ రచించిన 'తెలంగాణ చరిత్ర తొవ్వల్లో' లాంటి పుస్తకాలను ఆవిష్కరించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్, టీఎస్‌పీఎస్సీ మాజీ చైర్మన్ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి, ప్రముఖ సీనియర్ జర్నలిస్ట్ రామచంద్రమూర్తి, మాజీ న్యాయమూర్తి ప్రముఖ రచయిత డాక్టర్ మంగరి రాజేందర్ హాజరై పుస్తకాలను ఆవిష్కరించారు. ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి మాట్లాడుతూ మరుగున పడిన అనేక విషయాలను శివనాగి రెడ్డి వెలుగులోకి తెస్తారన్నారు. ప్రొఫెసర్ ఎస్.రఘు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో చరిత్ర పరిశోధకుడు బి.వి భద్రగిరీశ్(తెలంగాన చరిత్ర కారుడు), డాక్టర్ శ్యాంసుందర్ రావు, దక్కన్ హెరిటేజ్ అకాడమీ చైర్మన్ వేదకుమార్, శివనాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బుక్ ఫెయిర్ ముగింపు సభలో పాల్గొన్న జస్టిస్ రాధారాణి, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం, సీనియర్ జర్నలిస్ట్ రామచంద్రమూర్తి

ప్రభుత్వంపై పోరాటం చేస్తాం



దివ్యాంగుడితో మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

కందుకూరు, డిసెంబర్ 29:కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి తెలిపారు. మండల పరిధిలోని లేమూరు మీదుగా వెళుతూ మార్కెట్ వద్ద ప్రజలను చూసి కారు ఆపి ప్రజల వద్దకు వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం పాలన ఏ విధంగా ఉందని ప్రశ్నించారు. దీంతో ప్రజలు కాంగ్రెస్ పాలనపై విసుగు చెందుతున్నట్లు ఆమెకు వివరించారు. ఇచ్చిన మాటకు కట్టుబడి లేరని తెలిపారు. అనంతరం దివ్యాంగుడితో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజాసమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వంపై పోరాటం చేస్తానని వారికి తెలిపారు. తనపై నమ్మకం ఉంచి గెలిపించిన ప్రజల రుణం తీర్చుకుంటానని పేర్కొన్నారు. ప్రజలందరికీ అండగా ఉంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఎలుక మేఘనాథ్‌రెడ్డి, మాజీ సర్పంచ్, ఉప సర్పంచ్‌లు ఢీల్లి గణేశ్ ముదిరాజ్, సురుసాని కొండల్‌రెడ్డి పాల్గొన్నారు.

ట్రాఫిక్ రద్దీ, వరద నివారణపై దృష్టి

త్వరలో జీహెచ్ఎంసీలో టెక్నాలజీ రిసోర్స్ సెంటర్ ఏర్పాటు

సిటీబ్యూరో, డిసెంబర్ 29 (నమస్తే తెలంగాణ) : గ్రేటర్‌లో ట్రాఫిక్ రద్దీ, డ్రైనేజీ నిర్వహణ వంటి సవాళ్లను అధిగమించేందుకు జీహెచ్ఎంసీ, వరంగల్ ఎన్ఐటీ సివిల్ ఇంజినీరింగ్ విభాగం సహకారంతో అత్యాధునిక సాంకేతిక కేంద్రం (టెక్నాలజీ రిసోర్స్ సెంటర్) ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నది. ఆధునిక, ఆచరణాత్మక, స్థిరమైన పరిష్కారాలను అందించడం, వాటిని ప్రణాళిక దశలోనే చేర్చడం లక్ష్యంగా పెట్టుకున్నారు. ట్రాఫిక్, రవాణా విభాగంపై లోతైన విశ్లేషణలను నిర్వహించి, హైదరాబాద్ నగరంలో పెరుగుతున్న పట్టణ అవసరాలకు అనుగుణంగా ట్రాఫిక్ నిర్వహణ, మౌలిక సదుపాయాలు, రవాణా ప్రణాళిక, డ్రైనేజీ నెట్‌వర్క్‌పై సమగ్ర అధ్యయనం చేయనుంది. ఈ మేరకు జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో ఇలంబర్తి ఎన్ఐటీ ప్రొఫెసర్ ప్రసాద్ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ట్రాఫిక్ రద్దీ, వరద నివారణల చర్యలపై దృష్టి సారించనున్నారు. ఈ మేరకు అవసరమైన మార్గదర్శకాలు, ఒప్పందాలను సిద్ధం చేయాలని కమిషనర్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ప్రాజెక్టు సీఈ దేవానంద్, మెయింటెనెన్స్ సీఈ భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీసీ కులాల ఐక్యవేదిక రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉదయ్

ఉదయ్ ముదిరాజ్‌కు నియామక పత్రాన్ని అందజేస్తున్న బ్రహ్మయ్య

ఆర్కేపురం, డిసెంబర్ 29:బీసీ కులాల ఐక్యవేదిక రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా గంజి ఉదయ్ ముదిరాజ్ నియమితులయ్యారు. రాష్ట్ర అధ్యక్షుడు పెద్దపూర బ్రహ్మయ్య నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బ్రహ్మయ్య మాట్లాడుతూ ఈడబ్ల్యూసీ కోటాను 10 శాతం అమలు చేయడం వల్ల ఎస్సీ, ఎస్టీ, బీసీలతో పాటు ఓపెన్ కేటగిరి అభ్యర్థులు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. తెలంగాణలో మొత్తం ఉద్యోగాలలో 10శాతం ఈడబ్ల్యూసీ రిజర్వేషన్ అమలు చేస్తుండటం వల్ల మొత్తానికి మోసం జరుగుతుందన్నారు. తెలంగాణలో ఈడబ్లూసీ కోటాను ఎత్తివేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మద్దెల వినయ్ కుమార్, అరవింద్, మధు, జగదీశ్, ప్రదీప్, యాదయ్య, రాములాల్, వెంకటేశ్, లక్ష్మయ్య, సైదులు, శేఖర్ తదితరులు ఉన్నారు.

ఇద్దరు కంటే ఎక్కువ పిల్లలున్న వారికి స్థానిక సంస్థల్లో అవకాశం కల్పించాలి

మాట్లాడుతున్న అభిమాన్ గాంధీనాయక్

ఖైరతాబాద్, డిసెంబర్ 29: రాష్ట్రంలో త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇద్దరు కంటే ఎక్కువ పిల్లలున్న వారికి అవకాశం కల్పించాలని ఉద్యమ కమిటీ అధ్యక్షుడు, బంజారా కీర్తిరత్న అవార్డు గ్రహీత, తెలంగాణ రాష్ట్ర గిరిజన కో ఆపరేటీవ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ధరావత్ అభిమాన్ గాంధీనాయక్ కోరారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 1995 మే 15న ఇద్దరు పిల్లల కంటే ఎక్కువ సంతానం కలిగిన వారు స్థానిక సంస్థల ఎన్నికల్లో అనర్హులుగా ప్రకటిస్తూ సెక్షన్ 213ను తీసుకువచ్చారని తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2019 మున్సిపాలిటీల్లో ఈ నిబంధనను తొలగించిందని గుర్తు చేశారు. దేశంలోని అనేక రాష్ట్రాల్లో ఇలాంటి చట్టం లేదన్నారు. చంద్రబాబు తీసుకువచ్చిన ఈ నిబంధనలను ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ ఏడాది నవంబర్ 18న తొలగించిందన్నారు. ఈ నిబంధనల తొలగింపుపై సానుకూలంగా స్పందించాలని కోరుతూ మంత్రి సీతక్క, సీఎస్ శాంతికుమార్‌లకు వినతి పత్రాలు సమర్పించామని, మంత్రి పొన్నం ప్రభాకర్, స్పీకర్ ప్రసాద్ కుమార్‌ల దృష్టికి తీసుకెళ్లామన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ నాటికి ఈ నిబంధనను తొలగించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి లింగా రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, పరుశురాములు పాల్గొన్నారు.

నిమ్స్ సిబ్బంది మర్యాదగా ప్రవర్తించాలి

- దురుసుగా ప్రవర్తిస్తే చర్యలు తప్పవు
- రోగులు, సహాయకులు, జర్నలిస్టులతో ఫ్రెండ్లీగా ఉండాలి
- సూచనలు చేసిన వైద్యాధికారులు

నిమ్స్ సిబ్బందికి సూచనలు చేస్తున్న డాక్టర్ లక్ష్మీభాస్కర్ చిత్రంలో రాకేశ్, చరణ్ రాజ్

ఖైరతాబాద్, డిసెంబర్ 29: నిమ్స్ ఆస్పత్రికి వచ్చే రోగులు, వారి సహాయకులు, జర్నలిస్టులతో మర్యాదగా వ్యవహరించాలని నిమ్స్ వైద్యాధికారులు సిబ్బందిని ఆదేశించారు. ఆదివారం నిమ్స్ సెక్యూరిటీ కార్యాలయం వద్ద అడిషనల్ మెడికల్ సూపరింటెండెంట్లు డాక్టర్ లక్ష్మి భాస్కర్, డాక్టర్ రాకేశ్ నరిమేటి, డాక్టర్ చరణ్ రాజ్ మేడే సెక్యూరిటీ, ఇతర సిబ్బందితో సమావేశం నిర్వహించారు. నిమ్స్ దవాఖానకు నిత్యం రోగులు, వారి సహాయకులతో పాటు వివిధ సమాచార సేకరణ, వైద్య సేవల కోసం జర్నలిస్టులు వస్తుంటారని, వారితో కమ్యూనికేట్ చేసేటప్పుడు మర్యాదగా ప్రవర్తించాలన్నారు. ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు ఆస్పత్రిని సందర్శిస్తే వారి గుర్తింపు కార్డులను గౌరవ ప్రదంగా అడగాలని, నిర్దేశించిన మీడియా పాయింట్ వద్ద వేచి ఉండాలని సూచించాలన్నారు. తద్వారా మీడియా కోఆర్డినేటర్‌ను సంప్రదించే అవకాశం కల్పించాలన్నారు. ఆస్పత్రిలో జరిగే ముఖ్య కార్యక్రమాలను వెంటనే తెలియజేయడం, ముఖ్యమైన శస్త్రచికిత్సలు జరిగితే సమగ్ర నివేదిక అందించడం, పత్రిక సమావేశాలను నిర్వహించడం, వారికి ఇబ్బందులు కలుగకుండా తగిన సౌకర్యాలు కల్పించడం ప్రజాసంబంధాల అధికారి, కోఆర్డినేటర్ బాధ్యత అని అన్నారు. ప్రస్తుతం మీడియా పాయింట్‌ను ఆస్పత్రి సమాచార కేంద్రం వద్ద ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. నిమ్స్ సిబ్బంది దురుసుగా ప్రవర్తించినట్లు తమ దృష్టికి వస్తే కఠిన చర్యలు తప్పవన్నారు.

విద్యారంగం బలోపేతానికి స్కూటో కృషి

అభివాదం చేస్తున్న ప్రొఫెసర్ సింహాద్రి, వెంకట రాజయ్య

చిక్కడపల్లి,డిసెంబర్ 29 : స్కూల్స్, కాలేజెస్,యూనివర్సిటీస్ టీచర్స్ ఆర్గనైజేషన్స్ జేఏసీ ఆవిర్భవ సభ (స్కూటో జేఏసీ) సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆదివారం నిర్వహించారు. ప్రొఫెసర్ మురళీ మనోహర్ అధ్యక్షతన జరిగిన ఈ సభకు రిటైర్డ్ జస్టిస్ చంద్రకుమార్, ప్రొఫెసర్లు మురళీ మనోహర్, సింహాద్రి, గడ్డం మల్లేశం,కొండా నాగేశ్వర రావు, నాగుల వేణు యాదవ్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఖమ్మం టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా ప్రొఫెసర్ వెంకట రాజయ్యను ప్రకటించారు. వారు మాట్లాడుతూ భవిష్యత్తులో విద్యారంగాన్ని బలోపేతం చేయడానికి స్కూటో కృషి చేస్తుందని తెలిపారు. వెంకట రాజయ్య నాలుగు దశాబ్దాలుగా ఉపాధ్యాయుడిగా, సామాజిక, రాజకీయ ఉద్యమకారుడిగా, తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించారని తెలిపారు. ఈ సమావేశంలో డాక్టర్ జీవన, ఉపాధ్యాయులు మల్లయ్య, సామాజిక కార్యకర్త సందీస్, మాజీ ఏజీపీ హైకోర్టు జక్కుల కృష్ణ యాదవ్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

కన్హా శాంతివనంలో సీఎం రేవంత్‌రెడ్డి

కన్హాలో మొక్క నాటుతున్న సీఎం రేవంత్‌రెడ్డి, ధ్యాన గురువు కమలేశ్ పటేల్, ఎమ్మెల్యేలు శంకర్, యాదయ్య

హైదరాబాద్, డిసెంబర్ 29 (నమస్తేతెలంగాణ):రంగారెడ్డి జిల్లా నందిగామ మండలం కన్హా శాంతి వనాన్ని ఆదివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సందర్శించారు. అక్కడి విద్యార్థులతో మాట్లాడారు. వారు నేర్చుకున్న సాఫ్ట్ స్కిల్స్ వివరాలను తెలుసుకున్నారు. కళ్లకు గంతలు కట్టుకొని చదవడం, రంగులేయడాన్ని చూసి ఆశ్చర్యపోయారు. విద్యార్థులను అభినందించారు. ఈ నైపుణ్యాలను ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాల్లో అమలు చేయాల్సిన అవసరమున్నదని అభిప్రాయపడ్డారు. అనంతరం అక్కడి ట్రీ కన్జర్వేషన్ సెంటర్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా వంగడాల అభివృద్ధి, మొక్కల పెంపకం గురించి నిర్వాహకులు సీఎంకు వివరించారు. అక్కడి నుంచి రెయిన్ ఫారెస్ట్‌కు వెళ్లారు. మెడిటేషన్ సెంటర్ వద్ద గ్లోబల్ గైడ్, పద్మ భూషణ్ దాజీతో కలిసి గాలిబూడ మొక్క నాటారు. కార్యక్రమంలో సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు శ్రీనివాసరాజు, ఎమ్మెల్యే శంకరయ్య పాల్గొన్నారు.

హార్డ్ కాపీలను సమర్పించాలి

సిటీబ్యూరో, డిసెంబర్ 29 (నమస్తే తెలంగాణ): వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ పరిధిలోకి వచ్చే ప్రభుత్వ, ప్రైవేట్ యూనివర్సిటీ ఇంజినీరింగ్ నర్సింగ్, ఇతర కళాశాలలకు సంబంధించి 2017-18 నుంచి 2024-25సంవత్సరం వరకు పెండింగ్ ఉన్న ఉపకార వేతనాలకు సంబంధించిన దరఖాస్తు ఫారాల హార్డ్ కాపీలను వచ్చే నెల 20వ తేదీలోగా జిల్లా వెనకబడిన తరగతుల అభివృద్ధి అధికారి కార్యాలయంలో సమర్పించాలని బీసీ వెల్ఫేర్‌శాఖ ఉప సంచాలకులు ఆశన్న సూచించారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

కల్యాణం..వైభోగం



సిద్దిపేట జిల్లా కొమురవెల్లిలో కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

- వైభవంగా మల్లన్న కల్యాణ మహోత్సవం
- వేద మంత్రోచ్చరణలతో మార్మోగిన కొమురవెల్లి క్షేత్రం
- పట్టువస్త్రాలు సమర్పించిన ఆలయవర్గాలు
- హాజరైన ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, చామకూర మల్లారెడ్డి,

చేర్యాల, డిసెంబర్ 29: సిద్దిపేట జిల్లాలోని కొమురవెల్లి మల్లికార్జున స్వామి కల్యాణోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. క్షేత్రంలోని తోటబావి కల్యాణ వేదిక వద్ద జరిగిన కల్యాణోత్సవానికి వేలాదిగా భక్తులు తరలివచ్చారు. వీరశైవ ఆగమశాస్త్ర ప్రకారం కల్యాణం నిర్వహించగా, పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను ఆలయవర్గాలు సమర్పించారు. కల్యాణోత్సవంలో స్వా మి వారి తరపున పడిగన్నగారి ఆంజనేయులు దంపతులు,అమ్మవార్ల తరపున మహదేవుని భాస్కర్ దంపతులు పాల్గొన్నారు. గర్భగుడిలో జరిగిన కల్యాణోత్సవంలో అమ్మవారి తరపున మహాదేవుని రవి, స్వామి వారి తరపున పడిగన్నగారి మల్లయ్య దంపతులు పాల్గొన్నారు. స్వామి,అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను అర్చకు లు ఆలయం నుంచి పోలీసు బొమ్మ, రాతిగీరలు, ఆల య పరిసరాల్లో ఊరేగించారు. మేళతాళాలు, కోలా టం, చెక్క భజనలు, వేద పాఠశాల విద్యార్థుల శివ కీర్తనలతో కల్యాణ వేదిక వద్దకు తీసుకువచ్చారు. కాశీ పీఠాధిపతి డాక్టర్ మల్లికార్జున శివాచార్య మహాస్వామి వేద పర్యవేక్షణలో కల్యాణం జరిగింది. వీరశైవ ఆగమ పండితులు, పురోహితులు, ఆగమ పాఠశాల వేద పండితులు, ఆగమ విద్యార్థులు కల్యాణోత్సవం నిర్వహించారు. పురోహితులుగా నడిపుడి మఠం భవనయ్య స్వా మి, భువనేశ్వర స్వామి, ఆనందయ్య, జ్ఞానశ్వర్‌శాస్త్రి, చంద్రశేఖర్‌స్వామి, భద్రయ్యస్వామి వ్యహరించారు. డాక్టర్ మహంతయ్య,నందుల మఠం శశిభూషణ సిద్ధాంతి స్వామీజీ వ్యాఖ్యాతలుగా వ్యహరించారు. భక్తుల కోసం శామియానాలు, చలువ పంది ళ్లు ఏర్పాటు చేశారు. ఉదయం 5గంటలకు రెండు క్వింటాళ్ల బియ్యా న్ని అన్నం వండి రాశిగా తయారుచేసి దిష్టికుంభం తీశారు.

హాజరైన ప్రముఖులు

కల్యాణానికి ముందు ఊరేగింపుగా వెళ్లి స్వామి వారి తరపున మహదేవుని వంశస్తులు, పడిగన్నగారి వంశస్తులు కూర్చుని కల్యాణోత్సవం నిర్వహించారు. కల్యాణానికి తాళి, మట్టెలు, ఒడిబియ్యం, బట్టలను వారు తీసుకువచ్చారు. మధ్యాహ్నం 12గంటలకు రుద్రాభిషేకం, సాయంత్రం శకటోత్సవం నిర్వహించారు. స్వామివారికి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను ఆలయవర్గాలు సమర్పించాయి. ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి,భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, మాజీ మంత్రి చామకూర మల్లారెడ్డి, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, నాగపురి రాజలింగం, రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యురాలు రంగు బాల లక్ష్మి హాజరయ్యారు.ఆలయ ఈవో ఎ.బాలాజీ, దేవాదాయశాఖ ఆర్‌జేసీ రామకృష్ణారావు ఆధ్వర్యంలో ప్రత్యేక అధికారు లు బృందం, ఆలయ ఏఈవో బుద్ధి శ్రీనివాస్, సిబ్బంది కల్యాణోత్సవం సవ్యంగా సాగేందుకు చర్యలు తీసుకున్నారు.

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు

కొండాపూర్, డిసెంబర్ 29:మాదాపూర్‌లోని శిల్పారామంలో కొనసాగుతున్న ఆల్ ఇండియా క్రాఫ్ట్స్ మేళాలో భాగంగా నిర్వహిస్తున్న సాంస్కృతిక ప్రదర్శనలు సందర్శకులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. ప్రదర్శనల్లో భాగంగా ఆదివారం చెన్నై నుంచి విచ్చేసిన మృణాళిని త్యాగరాజన్ శిష్య బృందం ప్రదర్శించిన భరతనాట్య నృత్యాలు ప్రత్యేకంగా అలంకరించగా, హైదరాబాద్ అస్సాం అసోసియేషన్ ఆధ్వర్యంలో బిహు డాన్స్, బిహు సంగీత కచేరి ఎంతగానో ఆకట్టుకున్నాయి.